మాజీ మంత్రి కేటీఆర్‌ను కలిసిన శరత్

మాజీ మంత్రి కేటీఆర్‌ను ఆదివారం బీఆర్ఎస్ నాయకుడు పంపరి శరత్ మర్యాదపూర్వకంగా కలిశారు. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ హామీలను అమలు చేయకపోవడంతో ప్రజలు కాంగ్రెస్‌ను ఛీ కొడుతున్నారని ఆయన అన్నారు.

– కాచిగూడ, జనవరి 5

తాగునీటి పైపులైన్ పనులు ప్రారంభం

గోషామహల్ నియోజకవర్గం జాంబాగ్ డివిజన్‌లోని ఇడ్లీ గల్లీలో మంచినీటి సమస్య పరిష్కారానికి పైపులైన్ నిర్మాణ పనులను అధికారులు ప్రారంభించారు. సమస్యను ప్రజలు తన దృష్టికి తేవడంతో సంబంధిత అధికారులతో మాట్లాడి పనులను ప్రారంభించేలా కృషిచేసామని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఎం.ఆనంద్‌కుమార్‌గౌడ్ అన్నారు.

– ఆబిడ్స్, జనవరి 5

కురుమ సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ

ఎల్బీనగర్ నియోజకవర్గం కురుమ సంఘం 2025 క్యాలెండర్‌ను ఆదివారం కురుమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు యెగ్గె మల్లేశం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గం అధ్యక్షుడు బాలం ఈశ్వర్, చీర శ్రీనివాస్, చీర సత్యనారాయణ, బొల్లారం కృష్ణ, చీర గణేశ్, బొంకూరు కృష్ణ, కె. జనార్దన్, సిద్దాల గణేశ్, బి.రాజు, పాశం శ్రీకాంత్, కె.విజయ్, భరత్, బాలం శ్రీనివాస్, సీహెచ్, నవీన్, బాలం కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

– ఆబిడ్స్, జనవరి 5

ఎల్లవేళ లా అందుబాటులో ఉంటా

గోల్నాక శ్యామ్‌నగర్‌లో సమస్యలను తెలుసుకుంటున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్

- ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్

కాచిగూడ, జనవరి 5: ఇబ్బందులు తలెత్తకుండా ఎల్లవేళలా ప్రజలకు అందుబాటులో ఉంటానని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ అన్నారు. గోల్నాక డివిజన్ శ్యామ్‌నగర్ తదితర బస్తీలలో ఆదివారం ఎమ్మెల్యే గోల్నాక కార్పొరేటర్ దూసరి లావణ్య శ్రీనివాస్‌గౌడ్‌తో కలిసి పాదయాత్ర నిర్వహించి సమస్యలను తెలుసుకున్నారు. కొన్ని రోజులుగా లోప్రెషర్ నీటి సమస్య తలెత్తుతుందని, స్పీడ్‌బ్రేకర్లు, సీసీ రోడ్లు వేయాలని, డ్రైనేజీ సమస్యలు ఎదుర్కొంటున్నామని ఈ సందర్భంగా స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. స్పందించిన ఎమ్మెల్యే వెంటనే సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని పెండింగ్ సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తున్నామనని అన్నారు. ఇంకా ఏవైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని కోరారు. సమస్యలను సిబ్బంది నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సురేశ్‌గౌడ్, నర్సింగ్‌యాదవ్, బుచ్చిరెడ్డి, ప్రభాకర్ ముదిరాజ్, పడకంటి అంజయ్యచారి, లక్ష్మి ముదిరాజ్, విజయ్ పాల్గొన్నారు.

సేవా భావంతో పనిచేసినప్పుడే గుర్తింపు

అంబర్‌పేట, జనవరి 5 : సేవా భావంతో పనిచేసినప్పుడే సమాజంలో గుర్తింపు ఉంటుందని మాజీ రాజ్యసభ సభ్యుడు వి.హనుమంతరావు అన్నారు. బాగ్ అంబర్‌పేటలోని డాక్టర్ అబేద్కర్‌నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన నూతన అబేద్కర్ విగ్రహం తయారికి ఆయన ఆర్థిక సహాయాన్ని అందజేశారు. అంబేద్కర్‌నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు సుంకం కృష్ణ, కె.బాల్‌రాం, ఆర్.బాల్‌రాజ్, కె.శివకుమార్, కె. నరేందర్, కోటం అనిల్‌కుమార్, ఎన్. శ్రీనివాస్, ఎన్. ధనరాజ్, ఎస్.ప్రేమ్‌కుమార్, కె.కిషన్‌రావు, పి.అశోక్‌కుమార్, ఎం. వెంకటేశ్, అశిశ్, కె.యాదయ్య పాల్గొన్నారు.

కెనరా బ్యాంక్ ఎంప్లాయీస్ యూనియన్ సమావేశం

కెనరా బ్యాంక్ ఎంప్లాయీస్ యూనియన్ తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యుల సమావేశం నాగోల్‌లో ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆల్ ఇండియా ప్రెసిడెంట్ శ్రీనివాసన్, సెక్రటరీ బి. రాంప్రకాశ్, తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి బీఎస్. మధుసూదన్, మంజీరా సొసైటీ కార్యదర్శి కోటిరెడ్డి, సెంట్రల్ కమిటీ సభ్యులు మంజుల , వినయ్‌కుమార్, వికాస్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కెనరా బ్యాంక్ ఉద్యోగుల సంక్షేమం కోసం కృషి చేస్తానని ఆల్ఇండియా ప్రెసిడెంట్ శ్రీనివాసన్ పేర్కొన్నారు.

– ఆబిడ్స్, జనవరి 5

రెడీ టు సర్వ్ ఫౌండేషన్ సేవలు ప్రశంసనీయం

నీలోఫర్ దవాఖాన వద్ద అన్నదాన కార్యక్రమంలో అజయ్‌కుమార్‌గౌడ్ తదితరులు

తెలుగు యూనివర్సిటీ, జనవరి 5: రెడీ టు సర్వ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నీలోఫర్ దవాఖాన వద్ద ఆదివారం రోగులు, వారి సహాయకులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సుప్రజా దవాఖాన జీఎం అజయ్‌కుమార్‌గౌడ్, సినీ రచయిత శ్రీకాంత్‌రెడ్డి పాల్గొని ఫౌండేషన్ చైర్మన్ పెద్ది శంకర్ చేస్తున్న సామాజిక సేవా కార్యక్రమాలను వారు ప్రశంసించారు. ఫౌండేషన్ సేవా కార్యక్రమాల సమన్వయకర్త ప్రకాశ్‌తో పాటు సభ్యులు చైతన్య, రాజు, లక్ష్మణ్, పూజ తదితరులు పాల్గొన్నారు.

లూయిస్ బ్రెయిలీ జయంతి

నాంపల్లి నియోజకవర్గం అహ్మద్‌నగర్ డివిజన్‌లోని చాచానెహ్రూ పార్కు వద్ద ఆదివారం లూయిస్ బ్రెయిలీ 216 వ జయంతిని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దివ్యాంగుల కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్య, యూనియన్ బ్యాంక్ మేనేజర్ బక్కయ్య, విక్రం, శ్రీలత, మునావర్ తదితరులు పాల్గొన్నారు.

– మెహిదీపట్నం, జనవరి 5

సంక్రాంతి సంబురాలు

విజయమాధవి సాంస్కృతిక అకాడమీ ఆధ్వర్యంలో ఆబిడ్స్ తిలక్‌రోడ్డులోని తెలంగాణ సారస్వత పరిషత్తు ఆడిటోరియంలో ఆదివారం సాయంత్రం సంక్రాంతి సంబురాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ఔత్సాహిక కళాకారులు సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించారు. ఫిట్‌నెస్ మోటివేటర్ అనుప్రసాద్, రేడియో జాకీ శేఖర్ భాషా వీక్షించి, సంగీతం, నృత్య కళల వికాసానికి విజయమాధవి చేస్తున్న కృషిని ప్రశంసించారు. అనంతరం వారు కళాకారులకు జ్ఞాపికలు, ప్రశంసా పత్రాలను అందజేసి అభినందించారు.

– తెలుగు యూనివర్సిటీ

ముగిసిన రచయితలు, దర్శకుల శిక్షణ శిబిరం

శిక్షణ పొందిన రచయితలు, దర్శకులతో రచయితల సంఘం ఫౌండర్ డి.సురేశ్‌కుమార్

రవీంద్రభారతి, జనవరి 5 : తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో భారతి కల్చరల్ అకాడమీ, ఓం సాయి తేజ ఆర్ట్స్ సహకారంతో రవీంద్రభారతిలో నిర్వహించిన ఔత్సాహిక రచయితల, దర్శకుల శిక్షణ శిబిరం ఘనంగా ముగిసింది. ఈ కార్యక్రమానికి వక్తలుగా ప్రముఖ దర్శకులు ఎన్. ఆదిత్య, వీరశంకర్, ప్రముఖ నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ్, రాజ్ కందుకూరి, తెలుగు టెలివిజన్ రచయితల సంఘం ఫౌండర్ డి.సురేశ్‌కుమార్ తదితరులు విచ్చేసి జ్యోతి ప్రజ్వలనం చేసి శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా రజాకార్ చిత్ర దర్శకుడు యాట సత్యనారాయణను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కె.ఎల్. స్టూడియో అధినేత లక్ష్మణ్, రచయితల సంఘం అధ్యక్షుడు ప్రేమ్‌రాజ్, ప్రధాన కార్యదర్శి చిత్తరంజన్‌దాస్, రామోజు లక్ష్మీనారాయణ, మానస్ దండనాయక్, శ్రీనివాస్‌రాజు, కే విశ్వనాథ్, దిలీప్ బాస్కరశాస్త్రి, కమల్, ప్రేమ్‌రాజన్, జలగం నాగబాబు తదితరులు పాల్గొన్నారు.

సామాజిక స్పృహ కలిగిన వారే సమాజాన్ని ప్రేమిస్తారు

సామాజిక స్పృహ కలిగిన వారే సమాజాన్ని ప్రేమిస్తారని దక్షిణ మండల డీసీపీ స్నేహమిశ్రా అన్నారు. ఆదివారం దారుల్‌షిఫాలో రెహనుమా ఈ అవామి సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ.. సమాజంలో తోటి వారికి సహకరించాలనే స్పృహ ప్రతి ఒక్కరిలో ఉండాలని అప్పుడే ప్రతి సమస్యను సులువుగా పరిష్కరించుకోగలమని అన్నారు.

– చార్మినార్

మాదిగ డైరీ ఆవిష్కరణ

మాదిగ డైరీని ఆవిష్కరిస్తున్న వక్తలు

రవీంద్రభారతి, జనవరి 5 : తెలంగాణ మాదిగ సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు గడ్డం యాదగిరి అధ్యక్షతన మాదిగ డైరీ 2025 ఆవిష్కరణ రవీంద్రభారతిలోని సమావేశ మందిరంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎస్సీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ నాగరి ప్రీతం, మాజీ చైర్మన్ పిడమర్తి రవి హాజరై మాదిగ డైరీ-2025ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గడ్డం యాదగిరి మాట్లాడుతూ.. అంబేద్కర్ అభయహస్తం పథకం నిధులను వెంటనే విడుదల చేయాలని సీఎం రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ ఐక్యవేదిక అధ్యక్షుడు విజయ్‌కుమార్, మాదిగ మేధావుల ఫోరం అధ్యక్షుడు రాజేందర్, మాదిగ రాజకీయ పోరాట సమితి అధ్యక్షుడు బీఎన్ రమేశ్‌కుమార్, ఎస్సీ 57 ఉపకులాల ఐక్యవేదిక అధ్యక్షుడు రాజలింగం, ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర కో-ఆర్డినేటర్ నంద్రు నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ సేవలు అందించాలి

అధికారులు ప్రజలకు ఉత్తమ సేవలందించాలని నాంపల్లి ఎమ్మెల్యే మాజీద్ హుస్సేన్ అన్నారు. ఆదివారం ఎమ్మెల్యేను పలు ప్రభుత్వశాఖల అధికారులు మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలిపారు.

– మెహిదీపట్నం, జనవరి 5

చాదర్ సమర్పణ

ఉత్తర్‌ప్రదేశ్ గరీబ్ నవాజ్ దర్గాలో జరుగుతున్న 813 ఉర్సు ఉత్సవాలలో భాగంగా ఆదివారం కార్వాన్ ఎమ్మెల్యే మహ్మద్ కౌసర్‌మొహినుద్దీన్ తరపున మహ్మద్ అబ్బాస్ హుస్సేన్ చాదర్ సమర్పించారు.

– మెహిదీపట్నం, జనవరి 5

అదనపు అంతస్తు నిర్మించాలని వినతి

ఎమ్మెల్యే తలసానిని కలిసిన హమాలీ బస్తీవాసులు

బన్సీలాల్‌పేట్, జనవరి 5: పద్మారావునగర్‌లోని హమాలిబస్తీ కమ్యూనిటీ హాలుపై అదనపు అంతస్తు నిర్మించాలని కోరుతూ బస్తీ కమిటీ నాయకులు సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. ఆదివారం మారేడ్‌పల్లిలోని కార్యాలయంలో అయనను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ప్రస్తుతం ఉన్న కమ్యూనిటీ హాల్‌లో టాయిలెట్ రిపేర్ చేయించాలని, బస్తీలోని ఆలయ పరిసరాల్లో బండలు వేయించాలని, రాత్రి వేళల్లో బస్తీలో పోలీస్ పెట్రోలింగ్ పెంచాలని వారు అయనను కోరారు. ప్రజలు చెప్పిన సమస్యలకు తప్పకుండా పరిష్కార చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే తలసాని వారితో అన్నారు. బస్తీ కమిటీ అధ్యక్షుడు సుభాష్, నాయకులు కుశాల్, సత్యనారాయణ, శ్యామ్, సాయిగురు, నారాయణ పాల్గొన్నారు.

అలరించిన కూచిపూడి నృత్య ప్రదర్శన

కూచిపూడి నృత్యప్రదర్శన చేస్తున్న చిన్నారి సహస్ర

భారత్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబురాలు రవీంద్రభారతిలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు ప్రదర్శించిన కూచిపూడి నృత్య ప్రదర్శన అలరించింది. 6వ తరగతి చదువుతున్నకూచిపూడి నృత్య ప్రదర్శన చేసిన చిన్నారి సహస్ర అందరిచేత ప్రశంసలు అందుకున్నది. ఈ కార్యక్రమానికి సరస్వతి ఉపాసకులు దైవజ్ఞశర్మ తదితరులు విచ్చేసి జ్యోతి ప్రజ్వలనం చేసి కూచిపూడి నృత్యప్రదర్శనను ప్రారంభించారు. సహస్ర తల్లిదండ్రులు కాటూరి రాఘవాచార్య, రాగిణి, పలువురు నాట్యగురువులు పాల్గొన్నారు.

– రవీంద్రభారతి, జనవరి 5

ప్లాట్‌ఫాంపై వృద్ధుడు మృతి

కాచిగూడ, జనవరి 5 : అనారోగ్యంతో రైల్వేస్టేషన్‌లో గుర్తుతెలియని వృద్ధుడు మృతి చెందాడు. ఈ ఘటన కాచిగూడ రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గుర్తుతెలియని వృద్ధుడు(60)జూకల్ రైల్వే స్టేషన్ ప్లాట్‌ఫాం చివర్లో అనారోగ్యంగా ఉంటూ శనివారం రాత్రి మృతి చెందాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని ఉస్మానియా దవాఖానకు తరలించారు. మృతుని ఒంటిపై నషం రంగు చొక్క, నలుపు రంగు ప్యాంట్ ధరించి, ఎత్తు 5.3 ఉన్నట్లు పేర్కొన్నారు. కేసును కాచిగూడ రైల్వే పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

తవ్వి వదిలేశారు..

- నెల రోజులు దాటినా రోడ్డు నిర్మాణం చేపట్టని వైనం
- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు, స్థానికులు
- నిద్రమత్తులో అధికారులు

సిమెంటు రోడ్డు నిర్మాణం కోసం తొవ్వి వదిలేసిన రోడ్డు

చార్మినార్, జనవరి 5 : అదో ప్రధాన రహదారి, తవ్వితే త్వరగా పనులు ముగించి, ప్రయాణికులకు అందుమాటులోకి తేవాలి. కానీ అలాంటిదేమీ పట్టించుకోకూండా రోడ్డును తవ్వేసి నెలరోజులు దాటినా అటు వైపు కన్నెత్తి చూసిన పాపాన పోవడంలేదు. అయినా అధికారులు పట్టించుకోవడం లేదు. దీంతో ప్రయాణికులు, స్థానికులు నిత్యం నరకయాతన అనుభవిస్తున్నారు. ఇక ఎప్పుడు ఈ రోడ్డుకు మోక్షం లభిస్తుందోనని ప్రయాణికులు, స్థానికులు ఎదురు చూస్తున్నారు.

ఉప్పుగూడ, లాల్‌దర్వాజా, రాజన్నబౌలి, కందికల్‌గేట్, శాలిబండ, చార్మినార్ తోపాటు చంద్రయాణగుట్ట, బార్కస్ ప్రాంతాలకు వెళ్లడానికి నిత్యం వేలాది వాహనాలు ఆ మార్గంలో ప్రయాణాలు కొనసాగిస్తుంటాయి. అదే ప్రాంతంలో రాష్ట్రంలోనే అత్యంత వైభవంగా కొనసాగే బోనాల జాతర ప్రధాన ఆలయమైన లాల్‌దర్వాజా సింహవాహిని అమ్మవారి దేవాలయానికి వెళ్లే భక్తులకు సైతం ఇబ్బందికర పరిస్థితులు నెలకొన్నాయి. జీహెచ్ఎంసీ అధికారులు అభివృద్ధి పేరిట నెల రోజుల క్రితం రోడ్డు తవ్వి వదిలేశారు.

అభివృద్ధి పేరుతో రోడ్డు ధ్వంసం..

అప్పటి వరకు దశాబ్దాలపాటు ఉపయోగించిన తారు రోడ్డు స్థానంలో సిమెంట్ రోడ్డు వేస్తామని సంకల్పించిన జీహెచ్ఎంపీ అధికారులు రాత్రికి రాత్రే తారు రోడ్డును తొలగించారు. వెంటనే సిమెంట్ రోడ్డు వేస్తున్నట్లు చేప్పిన అధికారులు నెల రోజులుదాటినా తవ్విన రోడ్డును తవ్వినట్లే వదిలేశారు. ఫలితంగా ఆ మార్గంలో వెళ్లేల్సిన వాహననాలు గౌలిపుర మార్గంలో ప్రయాణిస్తున్నాయి. ఫలితంగా పది నిమిషాలలో గమ్యానికి చేరుకోవాల్సిన వాహనదారులు 30-40 నిమిషాల ప్రయాసాలకోర్చి చేరుకుంటున్నారు.

ఉదయం, సాయంత్రమైతే చెప్పలేని నరకయాతన..

ఉదయం, సాయంత్రమైతే చాలు ట్రాఫిక్‌తో చిన్న చిన్న గల్లీలు సైతం వాహనాల హారన్‌లతో హోరెత్తిపోతుంది. దీంతో ఇండ్లలో నివసించే వారికి కంటిమీద కునుకులేకుండా పోతోంది. ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించే పోలీసులు లేక పోవడంతో వాహనదారులు ట్రాఫిక్‌లో చిక్కుకుని బయటపడలేక ఇబ్బందులు పడుతున్నారు. ట్రాఫిక్ పోలీసులకు మా సమస్యలు పట్టావా? అంటూ పలువురు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా రోడ్డు మరమ్మతులు త్వరగా పూర్తి చేసి వాహనదారుల కష్టాలను తీర్చాలని పలువురు కోరుతున్నారు.

పండుగ సాయన్న జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలి

కోదండరాంను సన్మానిస్తున్న సాయన్న సేవా పురస్కార కమిటీ నేతలు

రవీంద్రభారతి, జనవరి 5 : పండుగ సాయన్న సమాజానికి చేసిన సేవలను గుర్తించి, ఆయన జయంతి, వర్ధంతి వేడుకలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించేలా చర్చించాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్సీ కోదండరాం అన్నారు. ఆదివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో పండుగు సాయన్న జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య వక్తలుగా ఎమ్మెల్సీ, కోదండరాం, సీనియర్ జర్నలిస్టు పాశం యాదగిరి, బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోయిని చంద్రశేఖర్‌ముదిరాజ్, టీజేఎస్ ప్రధాన కార్యదర్శి నిజ్జన రమేశ్ తదితరులు పాల్గొని సాయన్న చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చిన్న రాములు, బ్రహ్మయ్య, నిర్వాహకులు శివముదిరాజ్, సైదులు, సాయికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఇండ్ల మధ్యన ప్లాస్టిక్ వ్యర్థాల గోడౌన్లు

ఇండ్ల మధ్య నిర్వహిస్తున్న ప్లాస్టిక్ గోడౌన్

చార్మినార్, జనవరి 5 : ఏదైనా సమస్య వచ్చినప్పుడు హడావిడి చేసే అధికారులు సమస్యల నివారణకు శాశ్వత పరిష్కారం చూపడంలో విఫలమవుతున్నారు. నివాసిత ప్రాంతాల మధ్య కొనసాగుతన్న గోడౌన్లను నగర శివారు ప్రాంతాలకు తరలిస్తామని హామిలిచ్చిన అధికారులు అటువైపు మళ్లి చూసిన దాఖలాలు లేవు దీంతో స్థానికులు నరకయాతన అనుభవిస్తున్నారు.

ప్లాస్టిక్ వ్యర్థాలతో దుర్వాసన..

ప్లాస్టిక్ వ్యర్థాలతో దుర్వాసన వస్తుండడంతో స్థానికులు రోగాల బారిన పడు తున్నారు. దీంతో గత వర్షకాల ఆరంభంలో చార్మినార్ జోనల్ పరిధిలోని చంద్రయాణ గుట్ట, సంతోష్‌నగర్, మలకపేట్, రాజేంద్రనగర్, ఫలక్‌నుమా, చార్మినార్ సర్కిళ్ల పరిధిలో విషజ్వరాలు విజృంభించాయి. 16 మంది ప్రాణాలను సైతం బలితీసుకున్నాయి. కొన్ని ప్రాంతాల్లో కొనసాగుతున్న ప్లాస్టిక్ గోదాముల సమీప ప్రాంతాల్లో విషజ్వరాలు మరింతంగా ప్రభావాన్ని చూపించాయి. తూతూ మంత్రంగా చర్యలు తీసుకుంటున్న ఎంటమాలజీ విభాగం చర్యలతో దోమల నివారణ ఏ మాత్రం జరగడం లేదు. ఫలితంగా జ్వరాల బారిన పడుతున్న వారి సంఖ్య రోజు రోజుకూ పెరుగుతూ ఉంది. ఇప్పటికైనా అధికారులు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

నేడు కరెంట్ ఉండని ప్రాంతాలు

మెహిదీపట్నం, జనవరి 5 : విద్యుత్ లైన్లలో మరమ్మతుల కారణంగా ఆసిఫ్‌నగర్ పరిధిలోని పలు ప్రాంతాలలో సోమవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు మెహిదీపట్నం సీబీడీ ఏడీ ఓ ప్రకటనలో తెలిపారు.

ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు..

అహ్మద్‌నగర్, ఫస్ట్‌లాన్సర్, బోలానగర్, శ్మశాన వాటిక, బడాబజార్, పోచమ్మ బస్తీ, ఖాజానగర్, హాశం కంపౌండ్, షైని స్కూల్, నయీ బస్తీ, మిలటరీ వాల్, సయ్యద్ నగర్ 1, 2, శ్రీరాంనగర్, ఎంజీ నగర్, ఖాదీ భండార్, హాశం మసీద్, చాచా నెహ్రూ పార్కు, ధోబీఘాట్ ప్రాంతాలలో విద్యుత్ ఉండదు.

మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు..

హకీ గ్రౌండ్, మాసాబ్‌ట్యాంక్, ఆంధ్రా బ్యాంక్, జేఎన్‌టీయూ వెనక వైపు, శాంతినగర్, ఎన్ఎండీసీ, పీఎస్‌నగర్, మాసాబ్ ట్యాంక్ కట్ట, పాలిటెక్నిక్ కాలేజీ, జేఎన్‌టీయూ కాలేజీ, సాంకేతిక భవన్, విజయ డయాగ్నోస్టిక్ సెంటర్, హుమాయూన్‌నగర్,క్రీసెంట్ హాస్పిటల్, మెడివిజన్ హాస్పిటల్, ఎన్ఎండీసీ, ఎన్టీఆర్ ఇల్లు, మధుర్ స్వీట్ హౌస్ రత్నదీప్ తదితర ప్రాంతాలలో విద్యుత్ సరఫరా ఉండదు.